
న్యుమోనియా.. ప్రాణాలకే ముప్పు

నేడు వరల్డ్ న్యుమోనియా డే
- పిల్లలు అధికంగా వ్యాధి బారిన పడే అవకాశం
- 65 ఏళ్లు దాటినవారిలో కూడా..
- చలికాలంలో ఎక్కువగా కేసులు నమోదు

గుంటూరు మెడికల్: ఊపిరితిత్తులకు వచ్చి ప్రాణాలు తీసే వ్యాధుల్లో న్యుమోనియా ఒకటి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం అప్పుడే పుట్టిన పిల్లల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు నెమోనియా వ్యాధితో చనిపోతున్నారు. ప్రతి ఏడాది ఐదేళ్లలోపు పిల్లలు రెండు మిలియన్ల మంది ఈ వ్యాధి బారిన పడి చనిపోతున్నారు. ఈ వ్యాధి నివారణకు ఉన్న టీకాను వినియోగించటం ద్వారా పిల్లల మరణాలు తగ్గించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ అవగాహన కల్పిస్తోంది. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2009 నుండి ప్రతి ఏడాది నవంబర్ 12న వరల్డ్ న్యుమోనియాడే నిర్వహిస్తున్నారు.



వ్యాధి లక్షణాలు...

ఐదేళ్లలోపు పిల్లలు, 65 ఏళ్లు దాటిన వారు వ్యాధి బారిన పడుతున్నారు. దగ్గు, జలుబు, కళ్లె పడటం, కళ్లె పసుపు లేదా పచ్చగా ఉండటం, దగ్గినప్పుడు రక్తం పడటం, ఆయాసం, అలసట, ఛాతిలో నొప్పి, ఊపిరి పీల్చుకోవటం కష్టంగా ఉండటం, జ్వరం, చలి, వణుకు ఉండటం, తలనొప్పి, కండరాల నొప్పులు, చెమటలు పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవటం లేదా తక్కువగా కొట్టుకోవటం, వికారం, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు వ్యాధి సోకిన వారిలో ఉంటాయి. పిల్లల్లో వ్యాధి సోకితే శ్వాస తీసుకునే సమయంలో డొక్కలు ఎగురవేయటం, ఎక్కువసార్లు, వేగంగా శ్వాస తీసుకోవటం, అధిక జ్వరం, దగ్గు, జలుబు, ఎక్కువగా ఉండటం, పిల్లలు పాలు తాగలేకపోవటం తదితర లక్షణాలు కనిపిస్తాయి. చలికాలంలో న్యుమోనియా కేసులు ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఎక్కువ. ఆడవారితో పోల్చితే మగవారిలోనే వ్యాధి బాధితులు ఎక్కువగా ఉంటున్నారు.

కారణాలు...

వ్యాధి ఉన్న వారు ముఖానికి కర్చీఫ్ పెట్టుకోకుండా దగ్గినా, తుమ్మినా వారి నోటి తుంపర్ల ద్వారా ఆ క్రిములు గాలిలో వ్యాపించి పక్కన ఉండే వారికి వ్యాధి సోకుతుంది. వైరస్, బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందుతుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారిలో, పొగతాగేవారిలో, మద్యపానం చేసేవారిలో, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారిలో ఈ వ్యాధి సోకుతుంది.

నిర్ధారణ...

ఛాతి ఎక్సరే, సీటీ స్కాన్ పరీక్ష, రక్తపరీక్షలు, కళ్లె పరీక్ష, బ్రాంకోస్కోపీ, పల్స్ ఆక్సీమెట్రీ, ఫ్లూయిడ్ కల్చర్ పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారణ చేస్తారు.

వ్యాధి బాధితులు అధికమే...

గుంటూరు జిల్లాలో 150 మంది పిల్లల వైద్య నిపుణులు, 100 మంది పల్మనాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ ఇద్దరు బాధితులు చికిత్స కోసం వస్తున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో ప్రతి ఏడాది 4 వేల కేసులు నమోదవుతున్నాయి.

నివారణ చర్యలు...



వ్యాధి రాకుండా ముందస్తుగా పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్‌లు చేయించాలి. వ్యాధి సోకకుండా నివారించే వ్యాక్సిన్‌లు పిల్లలకు, పెద్దవారికి అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఉచితంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లలకు వ్యాక్సిన్లు వేయిస్తుంది. విచ్చల విడిగా యాంటిబయాటిక్స్ వినియోగించకూడదు. పబ్లిక్ ప్రదేశాల్లోకి వెళ్లినప్పుడు ముఖానికి మాస్క్ అడ్డుపెట్టుకోవటం చాలా మంచిది.

– డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు,
సీనియర్ పిల్లల వైద్య నిపుణులు, గుంటూరు

ఉచితంగా వ్యాక్సిన్...



రాష్ట్ర ప్రభుత్వం న్యుమోనియా మరణాలు కట్టడి చేయటమే లక్ష్యంగా 2021 జూలై నుంచి ఉచితంగా న్యుమోనియా కాంటిగేట్ వ్యాక్సిన్(పీసీవీ) ఉచితంగా చిన్నారులకు వేయిస్తోంది. వ్యాధి నివారణలో ముందస్తు చర్యల్లో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు 2024 ఏప్రిల్‌లో 52,500 డోసుల పీసీవీ వ్యాక్సిన్ వచ్చింది. ఇప్పటి వరకు 15,996 డోసులు వ్యాక్సిన్ చిన్నారులకు వేశాం. నెమోనియా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు,
జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, గుంటూరు

జాగ్రత్తలు తీసుకోవాలి...



న్యుమోనియా వ్యాధి బాధితులు త్వరగా కోలుకోవటానికి వైద్యులు రాసిన మందులు క్రమం తప్పకుండా వాడాలి. ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలి. ధూమపానం చేసేవారికి దూరంగా ఉండటంతోపాటుగా మద్యపానం, ధూమపానం చేయకూడదు. దగ్గినా, తుమ్మినా ముఖానికి కర్చీఫ్ అడ్డుపెట్టుకోవాలి. తరచుగా చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. పౌష్టికాహారం తీసుకోవాలి.

– డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి,
ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, గుంటూరు

క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: యోగద చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన తెలుగు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ క్విజ్ పోటీల్లో అరండల్‌పేటలోని హిందూ ప్రాథమికోన్నత ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి పొందినట్లు పాఠశాల కార్యదర్శి పరమహంస తెలిపారు. ఈసందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో హిందూ కాలేజీ హైస్కూల్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణప్రసాద్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అడ్వైజర్స్ రమణి, ఎంఎల్ఎస్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలభైరవునిగా మల్లికార్జున స్వామి దర్శనం



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం సందర్భంగా స్వామి శ్రీకాల భైరవస్వామిగా దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రశేఖర శర్మ స్వామికి విశేష అలంకారంతో పాటు ప్రత్యేక హారతులు ఇచ్చారు.

భాష్యం బ్లూమ్స్‌లో ప్లానిటోరియం షో



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు ఆచరణాత్మంగా నేర్పించినప్పుడే ఏ విషయమైనా లోతుగా అర్థమవుతుందని, ఆ దిశగా భాష్యం బ్లూమ్స్ కృషి చేస్తుందని భాష్యం బ్లూమ్స్ జెడ్ఈఓ వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం చంద్రమౌళినగర్‌లోని భాష్యం బ్లూమ్స్ సెకండరీ క్యాంపస్‌లో ఆస్ట్రోవిజన్ సంస్థ ఏర్పాటు చేసిన ప్లానిటోరియం షోలో భాగంగా విద్యార్థులకు మన విశ్వం, గ్రహాలు, నక్షత్రాల పనితీరుపై అవగాహన కల్పించారు. వరలక్ష్మి మాట్లాడుతూ మూడు రోజులపాటు కేజీ నుంచి టెన్త్ వరకు విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రైమరీ, సెకండరీ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల సీఈసీ ప్రథమ సంవత్సర విద్యార్థి వంశీ ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ మాజేటి వెంకట రామకోటి ముత్యాలు తెలిపారు. సోమవారం బ్రాడీపేటలోని కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల భీమవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవ పెద్ది విజయలక్ష్మి మాట్లాడుతూ వంశీ రాష్ట్ర స్థాయి పోటీల్లో వరసగా కాపర్, సిల్వర్ గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికయ్యాడని అభినందించారు.

ఆముక్తమాల్యద - మాలదాసరి వృత్తాంతంపై ప్రవచనం



ప్రవచిస్తున్న రంగనాయకి

లక్ష్మీపురం: స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం సాయంత్రం తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట రంగనాయకి ఆముక్తమాల్యద – మాలదాసరి వృత్తాంతంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. తొలుత ఆలయ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు: 11కేవీ లైన్ మరమ్మతులలో భాగంగా విద్యుత్ సరఫరా మంగళవారం నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గుజ్జనగుండ్ల, ఎస్వీఎన్ కాలనీ, నేతాజీ నగర్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని చెప్పారు.

వెండింగ్ జోన్ల ఏర్పాటుకు సహకరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నూతన వెండింగ్ జోన్లు ఏర్పాటుకు వీధి వ్యాపారులు, ఆయా సంఘాల ప్రతినిధులు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారుల సమస్యలు, వెండింగ్ కమిటీ ఏర్పాటు, వెండింగ్ జోన్ల నిర్ధారణ తదితర అంశాలపై వెండింగ్ కమిటీ సభ్యులు, ట్రాఫిక్, ఆర్ అండ్ బీ, ట్రాన్స్‌పోర్ట్, మెప్మా, సీపీడీసీఎల్, నగరపాలక సంస్థ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత వీధి వ్యాపారులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, జోన్ల ఏర్పాటు, గుర్తింపు కార్డుల పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకొని మాట్లాడుతూ వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి, వారికి మెరుగైన సంక్షేమ చర్యలు తీసుకోవడానికి ముందుంటామన్నారు. కాని వీధి వ్యాపారుల దగ్గర అద్దెలు పేరుతో దోచుకుంటున్న దళారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కమిటీ ఏర్పాటు అనంతరం డిసెంబర్ 10 నాటికి జోన్లను ఫైనల్ చేసుకునే లక్ష్యంతో స్థలాల పరిశీలన చేయాలన్నారు. రోడ్లు, ఫుట్ పాత్‌లు, డ్రెయిన్లు ఆక్రమణలను దశల వారీగా తొలగిస్తామన్నారు. తొలగించిన ప్రాంతాల్లో వాస్తవంగా వీధి వ్యాపారాలు చేసుకునే వారు అర్జీలు ఇస్తే వారికి తాత్కాలికంగా వ్యాపారం చేసుకోవడానికి స్థలాన్ని కేటాయిస్తామన్నారు. ఈ నెల 14 నుంచి జీఎంసీ ప్రధాన కార్యాలయంలో వీధి వ్యాపారుల గుర్తింపు దరఖాస్తులను ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అందిస్తామని, వీధి వ్యాపారులు దరఖాస్తు పూర్తి చేసి, అదే కౌంటర్‌లో అందిస్తే వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఉపా సెల్ పీఓ జె.రామారావు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తిక సోమవారం సందడి



పట్టాభిపురంలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో విశేష అభిషేకం చేస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోని శివాలయాల్లో కార్తిక సోమవారం సందడి కనిపించింది. భక్తి శ్రద్ధలతో నగరంలోని పలు దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, కార్తిక దీపాలను వెలిగించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
స్థానిక అరండల్‌పేటలోని గంగా మీనాక్షి సామెత సోమసుందరం ఆలయంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తులు అభిషేకాలు, భక్తులు కార్తిక దీపాలను వెలిగించి స్వామి వారిని సేవించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పట్టాభిపురంలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో విశేష అభిషేకార్చన నిర్వహించారు. మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం చైర్మన్ మెట్టుకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ రామలింగేశ్వరస్వామికి పర్వత వర్ధిని అమ్మ వార్లకు ప్రత్యేకాభిషేకార్చనలు చేశారు.



మల్లారెడ్డినగర్‌లో పర్వత వర్ధిని అమ్మవార్లకు ప్రత్యేకాభిషేకార్చనలు చేస్తున్న భక్తులు



అరండల్‌పేటలోని గంగా మీనాక్షి సామెత సోమసుందరం ఆలయంలో పూజలు

ఉచిత వైద్య శిబిరం

కొరిటెపాడు: తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్ 103 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా సోమవారం అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో పట్నంబజారులోని బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మద్ది వినోద్ కుమార్ బ్యాంకు ఖాతాదారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ రాజప్పన్, ఛీఫ్ మేనేజర్ సదేష్, బ్రాంచి మేనేజర్ దినకర్ జేబకుమార్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: తెలుగు దీపానికి శాశ్వత వెలుగు నిచ్చిన మహనీయుడు సీపీ బ్రౌన్ అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంగీత విద్వాంసుడు వి.యస్.ఎన్.మల్లేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బ్రౌన్ జయంతి సోమవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ గాయకుడు డి.టి.సాయిబాబు, సంస్థ సభ్యులు బిళ్లా అశోక్ మాట్లాడుతూ ఆ రోజుల్లో తెలుగు నేర్చుకోవటానికి సులభమైన శాస్త్రీయమైన విధానం లేక పోవటాన్ని గమనించిన బ్రౌన్ తెలుగు భాషా పరిశోధనకై నడుంబిగించాడన్నారు.

నేడు హోటల్ యజమానులతో సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్, ఫంక్షన్ హాల్స్ ఉన్న హోటల్స్ యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించానున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో వ్యర్థాల నిర్వహణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలో బల్క్‌గా వ్యర్థాలు ఉత్పత్తి జరిగే కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్, హోటల్స్ నిర్వాహకులకు వ్యర్థాల నిర్వహణ, తడి పొడి విభజన అంశాలపై అవగాహన కలిగించేందుకు నగరపాలక సంస్థ తరఫున ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు.

14న వ్యాసరచన పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని జేకేసీ కళాశాలలో ఈనెల 14వ తేదీ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ వలన సమాజానికి లాభమా!. నష్టమా!. అనే అంశంపై తెలుగు, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు వారి కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు..
జేకేసీ కళాశాల మహిళా సాధికారత సమితి ఆధ్వర్యంలో భవిష్యత్ కోసం అమ్మాయిల దృష్టి అనే అంశంపై ఈనెల 15న రాష్ట్ర స్థాయిలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ గోపీచంద్ తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు ఐడీ కార్డు, రిజిస్ట్రేషన్ రుసుం రూ.50, ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.

నాలుగేళ్ల బాలిక అదృశ్యం



లక్ష్మీపురం: నాలుగేళ్ల బాలిక అదృశ్యంపై సోమవారం లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రాజేష్, పద్మ ఇద్దరు ఈ నెల 9వ తేదీన పాత బస్టాండ్ సమీపంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రాంతానికి కుమార్తె మూడవత్ తేజస్విని తీసుకొచ్చారు. బాలికను షాపింగ్ మాల్ పక్కన మెట్ల మీద కూర్చోబెట్టి వారు టిఫిన్ కోసం వెళ్లారు. వచ్చి చూస్తే చిన్నారి కనిపించలేదు. పరిసర ప్రాంతాలలో వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో సీఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. ఆచూకి కోసం గాలిస్తున్నారు.

ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగోన్నతిపై విధుల్లో చేరిక



హెచ్‌ఎం పద్మావతికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: వేణుగోపాల్‌నగర్‌లోని కోన బాల ప్రభాకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయురాలిగా జీవీ పద్మావతి సోమవారం విధుల్లో చేరారు. కొత్తపేటలోని కాసు శాయమ్మ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయినిగా పని చేస్తూ హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతిపై వచ్చారు. ఆమెకు పాఠశాల ఉపాధ్యాయ బృందం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు మాట్లాడుతూ గుంటూరు నగగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో గత 24 ఏళ్లుగా పని చేస్తున్న పద్మావతి మంచి ఉపాధ్యాయురాలిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. శివకుమారి, జె.రమాదేవి, జె.విజయానంద్, వి.తనూజ, వై.రమ, సీహెచ్ చంద్రశేఖర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం షేక్ సమీర్, కె.జయలక్ష్మి, పి.హృదయ రాణి పాల్గొన్నారు.

ఆహార మార్పుల ద్వారానే మంచి ఆరోగ్యం



డాక్టర్‌ను సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: ప్రస్తుత పరిస్థితుల్లో మనకు వస్తున్న వివిధ అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారమే అని ప్రముఖ డైటీషియన్ డాక్టర్ ఆర్.బిక్షపతి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం చేస్తూ సమయపాలన పాటిస్తూ ఆహారాన్ని తీసుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవని పేర్కొన్నారు. సమావేశానికి కోఆర్డినేటర్‌గా టీవీ సాయిరాం వ్యవహరించగా డాక్టర్ రాఘవి, ప్రకృతి ఆశ్రమం నిర్వాహకులు శంకర్ రెడ్డి, వాణిజ్యవేత్త బాదం బసవగుప్త, జనవిజ్ఞాన వేదిక నాయకులు చలమారెడ్డి తదితరులు ప్రసంగించారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



లక్ష్మీపురం: భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ప్రతి ఏటా ఆజాద్ షాదీఖానా, ఉర్దూ ఘర్‌లో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మొహమ్మద్ షరీఫ్, జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోషన్ జమీర్ బాషా తెలిపారు. పట్టాభిపురంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీ ఖానా, ఉర్దూ ఘర్‌లో షాదీ ఖానా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు మొహియుద్దీన్ అహ్మద్, అబుల్ కలాం అనేది బిరుదు ఆజాద్ కలం పేరు అని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా, షాదీఖానా చైర్మన్ ఫరీయాజ్ పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్(ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరణ) నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 17 ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో వీధి దీపాల సమస్యలు 24 గంటల్లో పరిష్కరించాలని చెప్పారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతి పర్యవేక్షణకు కమిషనర్ చాంబర్‌లో ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయిస్తామన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్జీలు బీ అండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లడానికి వీలులేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలని కోరారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 63 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 19, ఇంజినీరింగ్ విభాగానికి 21, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 7, అకౌంట్స్ విభాగానికి 12, ఉపా సెల్ 5, పరిపాలన విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

రేపు ఉపకార వేతనాలు పంపిణీ



తులసి యోగీష్

కొరిటెపాడు: షెడ్యూల్డ్ తెగలకు చెందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు బుధవారం పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ సోమవారం తెలిపారు. ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ 17వ వార్షికోత్సవం సందర్భంగా కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ గుంటూరు, ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ చర్ల సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 200 మంది షెడ్యూల్డ్ తెగలకు చెందిన విద్యార్థులకు రూ.7 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమం ఉమ్మడి ఖమ్మం జిల్లా, చర్లలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతోందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై విద్యార్థులకు వితరణ చేయనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలి

లక్ష్మీపురం: వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా సంఖ్యాబలంతో నిమిత్తం లేకుండా ఇవ్వాలని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు(సంగమ్) సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహా వైఎస్సార్ సీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకుండా ఉండటంలో న్యాయబద్ధత ఉందని చెప్పారు. ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఉద్యోగులకు అవగాహన

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై జీఎంసీ ఉద్యోగులకు పోస్టల్ డిపార్ట్‌మెంట్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఇన్సూరెన్స్, పొదుపు కోసం మెరుగైన పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని, అదే విధంగా సోలార్ విద్యుత్(పీఎం సూర్య ఘర్) పథకాలను జీఎంసీ ఉద్యోగులు పరిశీలించి అనుకూలమైన వాటిని తీసుకోవాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుంచి పోస్టల్ అసిస్టెంట్ షాహెదా, సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసరావు హాజరై ఉద్యోగులకు అవగహన కల్పించారు.